క్లుప్తంగా

జగ్గయ్యపేట ఎస్‌ఐ-2గా శంకర్‌నాయక్



జగ్గయ్యపేటఅర్బన్: జగ్గయ్యపేట పట్టణ ఎస్‌ఐ-2గా నియమితులైన శంకర్‌నాయక్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎస్‌ఐ-2గా పనిచేస్తున్న వెంకటేశ్వరరావు ఇటీవల ఉద్యోగ విరమణ పొందగా, ఆస్థానంలో ఎస్‌బీలో పనిచేస్తున్న శంకర్‌నాయక్‌ను నియమిస్తూ పోలీసు కమిషనర్ ఆదేశాలు జారీయడంతో ఈ మేరకు ఆయన బాధ్యతలు చేపట్టారు. శంకర్‌నాయక్ గతంలో జగ్గయ్యపేట నియోజకవర్గంలోనే వత్సవాయి, పెనుగంచిప్రోలు మండలాల స్టేషన్లలో ఏఎస్‌ఐగా విధులు నిర్వహించారు.

సుచరితకు బెస్ట్ టీచర్ ఎడ్యుకేటర్ అవార్డు



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): కంచికచర్ల గవర్నమెంట్ జూనియర్ కళాశాల తెలుగు అధ్యాపకురాలు గుడిపూడి బేబిసుచరిత బెస్ట్ టీచర్ ఎడ్యుకేటర్ అవార్డును అందుకున్నారు. ఆంధ్రప్రదేశ్ ఎంఈడీ ప్రోస్పెరిటీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏటా అందించే ఈ అవార్డును 2025 సంవత్సరానికిగాను గుడిపూడి బేబి సుచరితకు లభించింది. విజయవాడలో శనివారం ఆ సంస్థ నిర్వహించిన అవార్డు ప్రదానోత్సవంలో నిర్వాహకులు ఈ పురస్కారాన్ని ఆమెకు అందజేశారు. రెండు దశాబ్దాలుగా విద్యాభివృద్ధికి బేబిసుచరిత అందిస్తున్న సేవలకు గాను ఆమెకు ఈ అవార్డును అందజేసినట్లు ఆసంస్థ ప్రతినిధులు తెలిపారు.

కరపత్రాల ఆవిష్కరణ



నందిగామరూరల్: హైదరాబాద్ రవీంద్రభారతీలో ఈనెల 22న ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మాదిగల కృతజ్ఞతాసభ విజయవంతానికి ప్రతిఒక్కరు కృషి చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా కో కన్వీనర్ కనకూడి వెంకటరత్నం మాదిగ కోరారు. మండలంలోని చందాపురంలో మాదిగల కృతజ్ఞత సభ కరపత్రాన్ని ఆదివారం ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కృతజ్ఞతాసభకు మాదిగలు పెద్దసంఖ్యలో హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు గుండెపోగు రాముడు మాదిగ, దారెల్లి చిన్న కోటేశ్వరరావు మాదిగ, మందా బాబురావు మాదిగ, కనకపూడి శేషయ్య మాదిగ తదితరులు పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గించడంపై బీజేపీ నాయకుల హర్షం



నందిగామటౌన్: ఈనెల 22 నుంచి ఆయా ఉత్పత్తులపై జీఎస్టీని తగ్గించడం హర్షణీయమని బీజేపీ నాయకులు తొర్లికొండ సీతారామయ్య పేర్కొన్నారు. జీఎస్టీని తగ్గించడాన్ని హర్షిస్తూ పట్టణంలోని రథంసెంటర్‌లో ఆదివారం బీజేపీ నాయకులు దేశప్రధాని మోడీ, ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యావసర సరుకులు, తదితరాలపై జీఎస్టీని ఐదు శాతానికి పరిమితం చేయడం ద్వారా పేదలపై ప్రధాని నరేంద్రమోడీ, ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ భారం తగ్గించారన్నారు. జీఎస్టీ తగ్గుదలపై అన్ని వర్గాల ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు మునగంటి కామేశ్వరరావు, బండారు కేదార్‌నాథ్‌శర్మ, తుటారి కృష్ణ, ఊటుకూరి వెంకట సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఈసారైనా..అధికారులంతా హాజరయ్యేనా?

- పీజీఆర్‌ఎస్‌కు గైర్హాజరవుతున్న పలుశాఖల అధికారులు
- పట్టించుకోని జిల్లా యంత్రాంగం..
- అధికారుల తీరుపై మండిపడుతున్న జనం



ఇటీవల చిల్లకల్లులో పీజీఆర్‌ఎస్‌కు హాజరైన ఇద్దరు అధికారులు(ఫైల్)

చిల్లకల్లు(జగ్గయ్యపేట): జగ్గయ్యపేట నియోజకవర్గంలోని ఆయా మండలాల్లోని మండల పరిషత్ కార్యాలయాల్లో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజాసమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్‌ఎస్) కార్యక్రమానికి పలుశాఖల అధికారులు డుమ్మా కొడుతుండటంపై అర్జీదారులు మండిపడుతున్నారు. నియోజకవర్గంలోని జగ్గయ్యపేట, పెనుగంచిప్రోలు, వత్సవాయి మండలాలల్లోని ఆయా మండల పరిషత్ కార్యాలయాల్లో సోమవారం ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు స్థానిక ఎంపీడీవోల ఆధ్వర్యంలో నిర్వహిస్తుంటారు. ఈ కార్యక్రమానికి మండల స్థాయిలోని అన్ని శాఖల అధికారులు తప్పనిసరిగా పాల్గొనాల్సి ఉంది. అయితే గత కొన్నివారాలుగా ఆయా మండలాలలో ఏర్పాటు చేసిన ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి పలుశాఖల అధికారులు గైర్హాజరువుతుండటంతో ఈ కార్యక్రమంపై ప్రజల్లో విశ్వాసం సన్నగిల్లుతోంది. దీంతో ఆయా సమస్యలను పరిష్కరించాలని కోరుతూ అర్జీదారులు విజయవాడలో కలెక్టర్ వద్ద మొరపెట్టుకుంటున్నారు.

ఒకరిద్దరు అధికారులే హాజరు!...

గత మూడు వారాలుగా చూస్తే ఆయా మండలాల్లో నిర్వహించిన పీజీఆర్‌ఎస్‌కు ఎంపీడీవోతో పాటు డిప్యూటీ ఎంపీడీవో, కార్యాలయ సిబ్బంది మాత్రమే హాజరయ్యారు. మిగిలిన ఐసీడీఎస్, వ్యవసాయ, ఆర్‌డబ్ల్యూఎస్, ఉపాధి హామీ పథకం, విద్యాశాఖ, వెలుగు, పంచాయతీ రాజ్ తదితర శాఖల అధికారులెవ్వరూ హాజరుగాకపోవడం గమనార్హం. సంబంధిత అధికారులు పీజీఆర్‌ఎస్‌కు గైర్హాజరవుతుండటంతో వచ్చిన అర్జీలపై అప్పటికప్పుడు వివరణ కోరే అవకాశం కూడా ఎంపీడీవోలకు ఉండటం లేదు. దీంతో అర్జీదారులు అసంతృప్తికి గురవుతూ ఈ కార్యక్రమంలో అర్జీలు ఇచ్చి ఉపయోగమేమిటనే అభిప్రాయం వ్యక్తంచేస్తున్నారు. దీంతో క్రమంగా మండల స్థాయిలో నిర్వహించే ఈ పీజీఆర్‌ఎస్ కార్యక్రమంపై ప్రజల్లో విశ్వాసం సన్నగిల్లుతుండగా, అర్జీదారులు సైతం జిల్లా కేంద్రానికి వెళ్తున్నారు. గత కొన్ని నెలలుగా మండల స్థాయిలో ఆయా పీజీఆర్‌ఎస్‌కు వచ్చే అర్జీల సంఖ్యే ఇందుకు నిదర్శమని చెప్పవచ్చు. దీంతో ఆయా సమస్యలను సత్వరమే స్థానికంగా పరిష్కరించేందుకు తలపెట్టిన ఈ పీజీఆర్‌ఎస్ కార్యక్రమ ఉద్దేశంతో దెబ్బతింటుండగా, ఈ కార్యక్రమంపై ప్రజల్లో విశ్వాసం కలిగించేందుకు అధికారులు ఎటువంటి చర్యలు చేపట్టకపోతుండటం గమనార్హం.

ఉన్నతాధికారుల ఉదాసీనతే కారణమా?..

పీజీఆర్‌ఎస్ కార్యక్రమానికి అన్నిశాఖల అధికారులు హాజరయ్యేలా చూడటంలో ఉన్నతాధికారులు సైతం విఫలమయ్యారనే విమర్శలు ప్రజల నుంచి వినిపిస్తున్నాయి. ప్రతి వారం గైర్హాజరయ్యే ఆయాశాఖల అధికారులపై ఎటువంటి చర్యలు తీసుకోకుండా ఉన్నతాధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తుండటం కూడా మరో కారణమని అర్జీదారులు భావిస్తున్నారు. ప్రస్తుతం సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో కీలకమైన వైద్య, ఆరోగ్యశాఖ, ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీ రాజ్ తదితర ముఖ్యమైన విభాగాల అధికారులు కూడా పీజీఆర్‌ఎస్‌కు హాజరుగాకపోతుండటం విమర్శలకు తావిస్తోంది. ఇక డివిజన్ స్థాయిలో ఆర్డీవో ఆధ్వర్యంలో నందిగామలో ప్రతి సోమవారం నిర్వహించే పీజీఆర్‌ఎస్‌కు కూడా అన్నిశాఖల అధికారులు హాజరుగాకపోతుండటం గమనార్హం. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి పీజీఆర్‌ఎస్ కార్యక్రమానికి అన్నిశాఖల అధికారులు హాజరయ్యేలా చూడాలని నియోజకవర్గ ప్రజలు కోరుతున్నారు.

ప్రసన్నకుమార్‌కు నాయకుల పరామర్శ



దార్ల దాసు మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

జగ్గయ్యపేటఅర్బన్: కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆర్‌అండ్‌బీ రిటైర్డ్ ఉద్యోగి, వైఎస్సార్ సీపీ పట్టణ కార్యదర్శి దార్ల ప్రసన్నకుమార్ తండ్రి దార్ల దాసు ఆదివారం మృతిచెందారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్ సీపీ నాయకులు 30వవార్డు, అంబేడ్కర్ నగర్‌లోని వారి నివాసానికి వెళ్లి దార్ల దాసు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తన్నీరు నాగేశ్వరరావు ఫోన్ ద్వారా ప్రసన్నకుమార్‌ను పరామర్శించి తన సంతాపాన్ని తెలియజేశారు. ప్రసన్నకుమార్‌ను పరామర్శించిన వారిలో ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు పఠాన్ ఫిరోజ్‌ఖాన్, పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మండవ శ్రీనివాసగౌడ్, రాష్ట్ర ఎస్సీసెల్ కార్యదర్శి దర్శనాల వెంకటరమణ, రాష్ట్ర రైతువిభాగం కార్యదర్శి నంబూరి రవి, రాష్ట్ర యువజన కార్యదర్శి శివరాత్రి పృథ్వీ, నియోజకవర్గ లీగల్ సెల్ అధ్యక్షుడు ఓర్సు రాజు, పార్టీ పట్టణ ప్రధాన కార్యదర్శి పింగళి నర్సింహరెడ్డి, పట్టణ యూత్ అధ్యక్షుడు రామిని ఉపేందర్‌రెడ్డి, పట్టణ యూత్ ప్రధాన కార్యదర్శి గొట్టిపాళ్ల సురేష్, ఏఎంసీ మాజీ డైరెక్టర్ మన్నె అప్పారావు, పట్టణ సోషల్ మీడియా కోఆర్డినేటర్ సయ్యద్‌ఆలీ తదితరులు ఉన్నారు.

అమ్మవారి దర్శనానికి పోటెత్తిన భక్తులు



పెనుగంచిప్రోలు: గ్రామంలో వేంచేసియున్న శ్రీతిరుపతమ్మ అమ్మవారి దర్శనానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. సెలవు దినం కావటంతోపాటు పలు శుభకార్యాలు ఉండటంతో అమ్మవారి దర్శనానికి వివిధ జిల్లాల నుంచి భక్తులు వేలాదిగా తరలివచ్చారు. భక్తులు అధికసంఖ్యలో తరలిరావడంతో ఆలయ క్యూలైన్లు, పరిసరాలు కిక్కిరిసిపోయాయి. వేకువ జామునుండే భక్తులు పాలు, పొంగళ్లతో అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయం చుట్టూ నిర్వహించిన అమ్మవారి రథోత్సవం కనులపండువగా సాగింది. అమ్మవారి నిత్యకల్యాణం వైభవంగా నిర్వహించారు. భక్తులు మధ్యాహ్న సమయంలో మునేరు అవతల మామిడి తోటల్లో సేద తీరారు.

నేడు పీజీఆర్‌ఎస్ కార్యక్రమం

కంచికచర్ల: స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సోమవారం ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ సీహెచ్ నరసింహారావు ఆదివారం తెలిపారు. ప్రజలు ఆయా సమస్యలపై అర్జీలు అందజేయవచ్చని వివరించారు.

ఆలయానికి రూ 2.01లక్షలు విరాళం



జగ్గయ్యపేటఅర్బన్: పట్టణంలోని పాలేటి తీరాన వేంచేసియున్న శివపంచాయతన క్షేత్రం మఠం శివాలయం పునర్నిర్మాణానికి మిట్టపల్లి కృష్ణారావు జ్ఞాపకార్థం వారి ధర్మపత్ని విజయలక్ష్మి, కుమారులు కోటేశ్వరరావు, హనుమంతరావు రూ 2,01,116లను విరాళం అందజేశారు. ఈ మేరకు నగదు ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులకు అందజేశారు.

నిత్యాన్నదానానికి విరాళం..

తిరుమలగిరి(జగ్గయ్యపేట): గ్రామంలో వేంచేసియున్న వేంకటేశ్వరస్వామి ఆయంలో అమలవుతున్న నిత్యాన్నదాన పథకానికి హైదరాబాద్‌కు చెందిన శ్రీవిద్య రూ.పదివేలను విరాళంగా అందజేశారు. ప్రత్యేక పూజలనంతరం ఆలయ సిబ్బంది దాతకు స్వామి వారి శేషవస్త్రం, ప్రసాదాలు అందజేశారు.

ఎంపీడీవో శ్రీనివాసరావుకు ఉద్యోగోన్నతి

నందిగామ రూరల్: నందిగామ ఎంపీడీవో శ్రీనివాసరావుకు ఉద్యోగోన్నతి లభించింది. శ్రీనివాసరావు డ్వామా ఏపీడీగా నియమితులయ్యారు. ఉద్యోగోన్నతిపై ఇక్కడి నుంచి బదిలీ అయినట్లు మండల పరిషత్ కార్యాలయ వర్గాలు తెలిపాయి. బదిలీపై వెళ్తున్న శ్రీనివాసరావును సోమవారం మండల పరిషత్‌కార్యాలయంలో ఘనంగా సత్కరించనున్నట్లు కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ నాగలక్ష్మి తెలిపారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



నాటి తమ గురువులతో గండేపల్లి జెడ్పీ పాఠశాల పూర్వవిద్యార్థులు(1994-95 బ్యాచ్)

గండేపల్లి(కంచికచర్ల): మండలంలోని గండేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1994-95లో పదోతరగతి చదివిన విద్యార్థులు ఆదివారం పాఠశాలలో కలుసుకున్నారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన ఆ బ్యాచ్ పూర్వ విద్యార్థులంతా హాజరై సందడిగా గడిపారు. తొలుత ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించి యోగాక్షేమాలు అడిగితెలుసుకున్నారు. చదువుకున్నప్పటి సంగతులను జ్ఞప్తి చేసుకుంటూ సంతోషం వ్యక్తంచేశారు. సినీ పాటలకు డ్యాన్స్‌లు చేసి అందరినీ అలరించారు. అనంతరం నాటి తమ ఉపాధ్యాయులైన లెక్కలు మాస్టారు శర్మ, సైన్స్ మాస్టారు ప్రసాద్, పీడీ సాయిబాబా దంపతులను ఘనంగా సత్కరించి వారి ఆశీర్వాదం తీసుకున్నారు. పూర్వ విద్యార్థులంతా కలుసుకునేందుకు వైఎస్సార్‌సీపీ ఎస్సీసెల్ రాష్ట్ర కార్యదర్శి వేల్పుల రమేష్, ప్రముఖవ్యాపారవేత్త దోడిపర్తి శ్రీనివాసరావు, ప్రముఖ న్యాయవాది పిల్లి దాసు, షేక్ అబూబకర్, గుజ్జర్లపూడి ప్రభాకర్, ప్రత్తిపాటి రాము తదితరులు చేసిన కృషిని పూర్వవిద్యార్థులు కొనియాడారు. డీజే సినిమా పాటలతో పలువురు పూర్వ విద్యార్థులు డ్యాన్స్‌లుచేసి అందరని ఉత్తేజపర్చారు. పాఠశాలకు ఓ బీరువాను బహూకరించారు. పాఠశాల హెచ్‌ఎం రామకృష్ణ, పూర్వవిద్యార్థులు పాల్గొన్నారు.

దేశసంపద కార్పొరేట్ల వశం : సీపీఎం



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి డీవీ కృష్ణ

వత్సవాయి: దేశసంపదను కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్లకు వశం చేస్తోందని సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి డీవీ కృష్ణ విమర్శించారు. మండలకేంంద్రం వత్సవాయిలోని బొగ్గవరపు వెంకటేశ్వరరావు విజ్ఞానకేంద్రంలో పార్టీ అఖిలభారత పూర్వ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి ప్రథమ సంస్మరణ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ముందుగా సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా డీవీ కృష్ణ మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలతో ప్రజాస్వామ్యంలో ప్రమాదంలో పడుతోందన్నారు. రాష్ట్రంలో వ్యవసాయోత్పత్తులకు గిట్టుబాటు ధర లేకపోవడంతో రైతులు సాగు మానేసే దిశగా అడుగులు వేస్తున్నారన్నారు. ఇది చాలా ప్రమాదకరస్థితికి దారితీస్తుందన్నారు. కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కాలయాపన చేస్తోందన్నారు. ప్రజలు ఇదంతా గమనిస్తున్నారని సరైన సమయంలో కూటమి నేతలకు గుణపాఠం తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆ పార్టీ సీనియర్ నాయకులు చిరుమామిళ్ల వెంకటేశ్వరరావు, సీపీఎం మండల కార్యదర్శి బి.రాము, మండల కమిటీ సభ్యులు మండేపుడి చంద్రశేఖర్, తమ్మినేని రమేష్, కంచర్ల కొండయ్య, కూరపాటి వెంకటేశ్వర్లు, సోమా రవి, కనకపుడి పటేల్, గంగుల వెంకయ్య పాల్గొన్నారు.

నందిగామ పట్టణంలో..



ఏచూరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

నందిగామరూరల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలతో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందని సీపీఎం జిల్లా సెక్రటేరియట్ సభ్యుడు కోట కళ్యాణ్ పేర్కొన్నారు. పట్టణంలోని 18వ వార్డు పరిధిలో సీపీఎం పూర్వ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి ప్రథమ వర్ధంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ పాలనలో దేశంలో నిరుద్యోగం, పేదరికం రోజురోజుకు పెరుగుతోందన్నారు. ముఖ్యంగా పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. ప్రజాసమస్యల పరిష్కారంలో ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆపార్టీ నాయకులు కటారపు గోపాల్, సయ్యద్ ఖాశీం, గోపీనాయక్, లాజర్, మల్లయ్య, బత్తుల వెంకటేశ్వర్లు, దాన, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

మధురంగా త్యాగరాజ స్వామి కృతులు



సంప్రదాయ కీర్తనలను ఆలపిస్తున్న చిన్నారులు

విజయవాడకల్చరల్: జేఎంఎస్ నాట్యవేద అకాడమీ ఆఫ్ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ ఆధ్వర్యంలో మొగల్రాజపురంలోని పీబీ సిద్ధార్థ అకాడమీలో ఆదివారం నిర్వహించిన సంగీత, నాట్య సమ్మేళనం సమ్మోహనంగా సాగింది. జంగం శ్రీనివాస చక్రవర్తి, విజయకుమార్ ఆధ్వర్యంలో మూడు గంటల పాటు జరిగిన స్వర, లయ, నాట్యవిన్యాసం ఆకట్టుకుంది. సంప్రదాయ సంగీత కార్యక్రమంలో భాగంగా నాట్యవేద విద్యార్థులు అన్నమయ్య, రామదాసు, త్యాగరాజ స్వామి కృతులను మధురంగా ఆలపించారు. గురు శిష్య మృదంగ సంవాద కార్యక్రమంలో మృదంగ విద్వాంసుడు అమ్ముల ప్రసాద్ జగం శిరీషా చక్రవర్తి నిర్వహించిన లయ విన్యాసం కార్యక్రమం ఆకట్టుకుంది. నాట్య అకాడమీ విద్యార్థులు ప్రదర్శించిన సంప్రదాయ నృత్యాలు ఆకట్టుకున్నాయి. సంగీత విద్వాంసులు అన్నవరపు రామస్వామి, వేదపండితులు డాక్టర్ వేదాంతం రాజగోపాల చక్రవర్తి, వయోలిన్ విద్వాంసుడు పాణ్యం దక్షిణామూర్తిని పాల్గొని ప్రతిభ చూపిన కళాకారులకు బహుమతులను అందజేశారు.

అలరించిన సినీ సంగీత విభావరి



సాహితీ సంస్థల ప్రతినిధులను సత్కరిస్తున్న నిర్వాహకులు

విజయవాడకల్చరల్: విశ్వశాంతి ఆర్ట్స్ అకాడమీ గుంటూరు ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని కొతా పూర్ణానందం కళావేదికమీద ఆదివారం నిర్వహించిన సినీ సంగీత విభావరి, సాహితీ సంస్థల ప్రతినిధులకు ఆత్మీయ సత్కార కార్యక్రమం వైభవంగా జరిగింది. గాదే రత్నరెడ్డి ఆధ్వర్యంలో విజయలక్ష్మి, సౌజన్య, వెంకరమణ, దయామణి, రవికిరణ్ తదితరులు పలు చిత్ర గీతాలలను ఆలపించారు. నగరానికి చెందిన సాహితీ సంస్థల ప్రతినిధులు చింతకాయల చిట్టిబాబు, కే డేవిడ్‌రాజు, నరసింహారావు, పరుచూరి విజయలక్ష్మిని నిర్వాహకుల పక్షాన విశ్వశాంతి ఆర్ట్స్ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారెడ్డి సత్కరించారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

జగ్గయ్యపేటఅర్బన్: మండలంలోని ఐదుగురు లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ నుంచి మంజూరైన రూ.2.67లక్షలను ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య) ఆదివారం పంపిణీ చేశారు. పోచంపల్లి గ్రామానికి చెందిన కనపర్తి పెదవీరయ్యకు రూ.1లక్ష, బూతుకూరి శేఖరరెడ్డికి రూ 50,180, లచ్చిరెడ్డికు రూ.81 వేలు, మందా చిట్టిబాబుకు రూ.15 వేలు, గద్దల నాగరత్నంకు మంజూరైన రూ.20,524 ల చెక్కులను బాధిత కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే పంపిణీచేశారు. కార్యక్రమంలో పోచంపల్లి టీడీపీ నాయకులు పింగళి రామకృష్ణారెడ్డి, కామిరెడ్డి శ్రీనివాసరెడ్డి, చింతారెడ్డి వెంకట నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

వీరులపాడు: రౌడీషీటర్లు నేర ప్రవృత్తిని మానుకుని సత్ప్రవర్తనతో నడుచుకోవాలని ఎస్‌ఐ అనిల్ హెచ్చరించారు. వీరులపాడు పోలీస్‌స్టేషన్‌లో రౌడీషీటర్లకు ఆదివారం ఆయన కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రౌడీషీటర్లపై నిరంతర నిఘా ఉంటుందన్నారు. ముఖ్యంగా అసాంఘిక కార్యక్రమాలు, ఘర్షణలు, వివాదాలు, శాంతిభద్రతలకు విఘాతం కలిగించేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. సత్ప్రవర్తనతో నడుచుకునే వారిని గుర్తించి వారిపై ఉన్న రౌడీషీట్ తొలగించేలా ఉన్నతాధికారులకు సిఫార్సు చేస్తామని తెలిపారు. అనంతరం ఎటువంటి నేరాలకు పాల్పడబోమంటూ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో పలువురు సిబ్బంది పాల్గొన్నారు.